|  | ఇఫ్తార్ ఆది॥ (సా॥) | సహార్ సోమ॥ (ఉ॥) |
|---|---|---|
| రాయచోటి : | 6.28 | 5.10 |
| రాజంపేట : | 6.26 | 5.18 |
| పీలేరు : | 6.27 | 5.10 |
| మదనపల్లె : | 6.29 | 5.12 |

రంజాన్ వేళలు



## అంగళ్లులో దొంగల స్వైర విహారం

కురబలకోట మండలం అంగళ్లులో వివిధ వాణిజ్య షాపులపై దొంగలు స్వైర విహారం చేశారు. తొలుత వరుసగా 5 షాపుల్లో, తర్వాత 2 షాపుల్లోకి చోరీకి పాల్పడ్డారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

|  | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.110 | రూ.130 |
| రెండోరకం | రూ.80 | రూ.100 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 68 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | - | - |
| సీబీ | 563 | 563 |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 30.260 కిలోలు

## న్యూస్‌రీల్

### గంగమ్మ తల్లీ.. చల్లంగ చూడవమ్మా



శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: ప్రజలందరినీ చల్లంగా చూడాలని గంగమ్మను ప్రార్థించినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరిన కోర్కెలు నెరవేరుస్తూ అనంతపురం గంగమ్మ తల్లి కొంగుబంగారంగా విరాజిల్లుతోందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయాన్ని రాయలసీమ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తానన్నారు. జాతర సందర్భంగా భక్తులకు అమ్మవారి దర్శనం సులభంగా లభించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు జాతర శుభాకాంక్షలు తెలిపారు.

### 50 శాతం రాయితీతో విద్యుత్‌లోడు క్రమబద్ధీకరణ

రాయచోటి అర్బన్: వినియోగదారులు తాము వాడుకుంటున్న అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీని ఇస్తున్నట్లు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆర్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 1 నుంచి జూన్ 30 వరకు ఆన్‌లైన్‌లో, కార్యాలయంలోనూ 50 శాతం రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.అధికారులు తనిఖీలు నిర్వహించి క నెక్షన్ తీసుకున్న లోడ్‌కంటే ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించుకునే వారిపై జరిమానాతో పాటు ప్రతి కిలో వాట్‌కు అదనంగా రూ. 2400 చొప్పున ఎన్ని కిలోవాట్‌లు వినియోగిస్తుంటే అంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారులు తనిఖీలకు ముందే వినియోగదారులు ప్రతికిలోవాట్‌కు 50 శాతం రాయితీ అంటే దాదాపు రూ.1000లు చెల్లిస్తే సరిపోతుందన్నారు.

### వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత

రాయచోటి జగదాంబసెంటర్: వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సుకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.ఆంజనేయులు తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీఓ హాలులో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పోస్ట్ బడ్జెట్ వెబినార్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకాలైన కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా వ్యవసాయ రుణ సదుపాయ కల్పన, నాలుగు శాతం సవరించిన వడ్డీ రాయితీ పథకం ద్వారా వ్యవసాయ రుణాలను రైతులకు అందుబాటులోకి తేవడం తదితరాలపై ప్రధానమంత్రి వర్చువల్‌గా కార్యక్రమంలో వివరించారు. అనంతరం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రైతులు తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశం కలిగి, వ్యవసాయం అనుబంధ రంగాలలో పెట్టుబడులు పెంచుకోవడానికి సహాయపడతాయన్నారు.

# గంగమ్మ జాతర.. జనసంద్రమాయెరా





ప్రత్యేక అలంకారంలో అనంతపురం గంగమ్మ తల్లి, భక్తులతో కిటకిటలాడుతున్న గంగమ్మ ఆలయ ప్రాంగణం

- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన లక్షలాదిమంది భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందినీ బండ్లు

లక్కిరెడ్డిపల్లి: రాయలసీమ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన అనంతపురం గంగమ్మ జాతర శనివారం వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో జాతరో... జాతర అన్నట్టు అనిపించింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.కోరిన కోర్కెలు తీర్చే తల్లీ..కరుణించి కాపాడవమ్మా అంటూ అనంతపురం గంగమ్మను భక్తులు వేడుకున్నారు.

**ఊరూరా బోనాలతో మొక్కులు చెల్లింపు....**

కస్తూరిరాజుగారిపల్లి గ్రామం, చాగల గుట్టపల్లె అమ్మవారిని అర్ధరాత్రి సమయంలో ఆరుబయట ఉంచారు. సంప్రదాయబద్ధంగా పి కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు మొదటి బోనం సమర్పించారు. జాగారానికి తరలిన భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొడుతూ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. రఘునాథ రెడ్డి మేనల్లుడు వాసు బోర్వెల్స్ నాని ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడంతో జాగారానికి వచ్చిన భక్తులు ఉత్సాహంగా చిందులు వేశారు. తెల్లవారుజామున మూడు గంటలకు బయలుదేరిన అమ్మవారి ఊరేగింపు అప్పలరాజుగారిపల్లి, మర్లవాండ్లపల్లి,మర్రిచెట్టు, చౌటపల్లి గ్రామాల మీదుగా సాగింది.మహిళలు సంతానం



జాతరలో చాందినీ బండి

కోసం అమ్మవారికి వరపడ్డారు. లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. చాందినీ, కుంకుమ బండ్లు భక్తులను ఆకట్టుకున్నాయి.. జాతరలో ఏర్పాటు చేసిన చెక్కభజన, కోలాటం, ఆర్కెస్ట్రా, జబర్దస్త్, రేలారేలా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు యువతను ఉర్రూతలూగించాయి. ఈ సంవత్సరం రూ.300 దర్శనాన్ని ఏర్పాటు చేశారు. కానాల గంగిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జాతరలో ఎన్నడూ లేనంత విధంగా మిఠాయి, శీతలపానీయాల దుకాణాలు, చెరుకు రసాల బండ్లు ఎక్కువగా కనిపించాయి. తెలంగాణ డప్పు వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి. డీఎస్పీ కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు 25 ట్యాంకర్లను ఏర్పాటు చేసి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. 32 సీసీ కెమెరాలు నిఘాలో జాతరను పోలీసులు పర్యవేక్షణ చేపట్టారు.

## తహసీల్దార్ కార్యాలయం
# రికార్డులు తారుమారు?

- ఫోర్జరీ సంతకాల నిష్ణాతునితో రికార్డుల సృష్టి..?
- ఫిబ్రవరి 25న రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు సాగిన తతంగం
- రెండు గంటల పాటు ఆగిన సీసీ ఫుటేజీల రికార్డ్..!



రాయచోటి తహసీల్దార్ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సాక్షిగా రికార్డుల మార్పుపై రాయచోటిలో జోరుగా చర్చ సాగుతోంది. రాయచోటి తహసీల్దార్ కార్యాలయ పరిధిలో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములపై మంత్రి అనుచరుల కన్ను పడిందన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఈ ప్రభుత్వ భూములను తమ వశం చేసుకోవాలంటే.. ముందుగా ఆ రికార్డులను ఫోర్జరీ సంతకాలతో తమకు అనుకూలంగా మార్చుకోవాలి.. అందుకు అనువైన అధికారి తహసీల్దార్ సీట్లో కూర్చోవాలి.. అనుకున్నదే తడువుగా రాయచోటి పట్టణం, రూరల్ పరిధిలో అన్ని సర్వే నంబర్లపై పట్టున్న డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించేశారు. గతంలో రాయచోటి పట్టణ పరిధిలో ఉన్న భూముల వివరాలన్నీ ఆయన గుప్పె ట్లోనే ఉన్నాయన్న వాదనలు ఉన్నాయి. కార్యాలయంలో ఉండాల్సిన డీకేటీ పట్టాలిచ్చిన రిజిస్టర్లు కొన్ని ప్రస్తుత తహసీల్దార్ కాలంలోనే మాయమైనట్లు తెలియవచ్చింది. ఈ క్రమంలోనే స్థానికంగా ప్రభుత్వ భూములపై అవగాహన ఉన్న దళారులు మంత్రి ముఖ్య సన్నిహితుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆ భూముల్లోని లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుంటే చట్టపరంగా దక్కించుకోవచ్చని మంత్రి సన్నిహితులు ఓకే అన్నట్లు తెలియవచ్చింది. అనుకున్నదే తడువుగా మంత్రి అనుయాయులు, ఆయన పర్సనల్ సెక్రటరీ కలిసి తహసీల్దారతో పాటు రికార్డులను తారుమారు చేయగల సామర్థ్యం, ఫోర్జరీ సంతకాలు చేయగల అనుభవం ఉన్న వ్యక్తిని అందుబాటులోకి తెచ్చుకున్నారని చెవులు కొరుక్కుంటున్నారు.

**533, 535 సర్వే నెంబర్లు, పాత బస్టాండ్ రికార్డులలో మార్ఫింగ్**

రాయచోటి పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 533, 535లలో మిలటరీ పట్టాలను, డీకేటీ పట్టాలను ఫోర్జరీ సంతకాలతో మార్ఫింగ్ చేసి ఆ భూములను తమ వశం చేసుకునేలా ప్రయత్నం చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అలాగే పాత బస్టాండ్ రికార్డులలో కూడా ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా ఉండేలా రికార్డులను తారుమారు చేసే కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారన్న సమాచారం రెవెన్యూ కార్యాలయ పరిసర ప్రాంతాలలో వినిపిస్తోంది.

### సీసీ కెమెరాలు ఆఫ్ చేసి..



రికార్డులను తారుమారు చేసే సమయంలో కార్యాలయంలోకి ఎవరు వస్తున్నారన్న సమాచారం తెలియకుండా కప్పి పెట్టేందుకు సీసీ కెమెరాల ఫుటేజీ రికార్డులను నిలుపుదల చేసినట్లు కార్యాలయ వర్గాల సమాచారం. ఫిబ్రవరి నెల 25వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో మంత్రి పీఎస్, ఫోర్జరీ సంతకాల నిపుణుడు రామాంజులు అనే వ్యక్తితో కలిసి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లినట్లు సమాచారం. వెనువెంటనే తహసీల్దార్ కార్యాలయం తలుపులు అన్నిటినీ మూసివేసి ముగ్గురూ కలిసి రికార్డుల మార్పిడికి ప్రయత్నాలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. గంటన్నర పాటు ఎవరిని లోపలికి రానివ్వకుండా తతంగాన్ని ముగించినట్లు కూడా తెలియవచ్చింది.

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

రాయచోటి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాల్లో 14335 మంది జనరల్ విద్యార్థులు, 1204 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనాల్సి ఉందని డీఈఓ ఎం కృష్ణయ్య తెలిపారు. అయితే మొదటి రోజున 721 మంది పరీక్షకు గైర్హాజరు కాగా 14674 మంది హాజరయ్యారన్నారు. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించామన్నారు.

**వైఎస్సార్ జిల్లాలో...**

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శనివారం ప్రథమ సంవత్సరానికి సంబంధించి తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని వసతులను కల్పించారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 64 పరీక్షా కేంద్రాలలో తొలిరోజు 17906 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 17196 మంది హాజర య్యారు. 710 మంది గైర్హాజరయారు. జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషన్‌కు సంబంధించి అన్ని పరీక్షా కేంద్రాలకుగాను 96 శాతం హాజరు నమోదదంది.



పీలేరు: పరీక్షలకు హాజరైన విద్యార్థులు

# 5 నుంచి ఒంటిమిట్టలో మహాసంప్రోక్షణ

టీటీడీ ఈఓ శ్యామలరావు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. ఒంటిమిట్ట ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ మరమ్మతులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు బాలాలయం నిర్వహించామన్నారు. భారత పురావస్తుశాఖ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఆధ్వర్యంలో ఆలయంలో పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తి కావచ్చాయని, మార్చి 5 సాయంత్రం 5.30 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తు హోమం, అంకురార్పణ జరుగుతుందన్నారు. మహాసంప్రోక్షణ సందర్భంగా మార్చి 6 ఉదయం 7.30 గంటలకు భగవత్పుణ్యాహం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తారు. మార్చి 7న ఉదయం 8 గంటలకు సహస్ర కలశావాహన, రామ తారక హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం జరగనుంది. మర్చి 8న ఉదయం 6 గంటలకు చతుస్థానార్చనం, శ్రీమద్రామాయణ యజ్ఞం, సాయంత్రం 6 గంటలకు కళాపకర్షణ, మూర్తి హోమం, మహాశాంతి అభిషేకం నిర్వహించనున్నారు. మార్చి 9న భగవత్పుణ్యాహం, మూర్తిహోమం పంచసూక్త, పవమాన హోమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, ఉదయం 10.15 గంటల నుంచి 11.30 గంటల వరకు వృషభలగ్నంలో మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, స్వర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. కార్యక్రమంలో టీటీటీ జేఈఓ వి వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మహాసంప్రోక్షణకు సిద్ధమవుతున్న యాగశాలను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

# పోసాని ఆరోగ్యం క్షీణించింది



రాజంపేట సబ్ జైల్ వద్ద పోసాని స్నేహితులతో సంభాషిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఆరోగ్యం పూర్తి స్థాయిలో క్షీణించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక సబ్ జైల్ వద్దకు పోసానిని ములాఖత్‌లో కలిసేందుకు శనివారం ఆకేపాటి విచ్చేశారు. అనంతరం మాట్లాడుతూ పోసానికి వైద్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈమేరకు సబ్ జైలర్‌ను కోరినట్లు తెలియజేశారు. అనంతరం పోసాని మిత్రులు సల్మాన్‌రాజ్, నజీర్‌లతో ఆకేపాటి చర్చించారు.

# డిప్యూటీ జైలర్ కూటమిలో భాగస్వామా?

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రాజంపేట రూరల్: రాజంపేట డిప్యూటీ జైలర్ మల్‌రెడ్డి కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారా అనే అనుమానం కలుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సబ్ జైల్ వద్దకు పోసానిని ములాఖత్‌లో కలిసేందుకు శనివారం ఆయన రాగా డిప్యూటీ సబ్ జైలర్ అనుమతించలేదు. తాను ములాఖత్ నిన్నే కోరానని, 5 నిమిషాలు సమయం ఇస్తే పోసానిని పరామర్శించి వెళ్లిపోతానని, ఇందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల విలేకరులతో మాట్లాడుతూ పోసాని ఆరోగ్యం క్షీణించిందన్నారు. ఆయనను కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమని అన్నారు. ఆయనను కలిసేందుకు కూడా మాకు వీలు కల్పించపోవటం హేయనీయమన్నారు. జైల్ సూపర్‌డెంట్ తీరుపై తమకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని కలిసేందుకు వస్తే పైన నుంచి ఫోన్‌లు వచ్చాయని తెలపటం అనేది కుట్రలో భాగమేనన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.



సబ్‌జైల్‌లోకి అనుమతించాలని డిప్యూటీ జైలర్‌ను కోరుతున్న కొరముట్ల శ్రీనివాసులు

# పవిత్ర యజ్ఞం.. రంజాన్ మాసం

- కనిపించిన నెలవంక
- భక్తిపారవశ్యంలో ముస్లింలు

రాజంపేట టౌన్/మదనపల్లె సిటీ: వరాల వసంతం వచ్చేసింది. ప్రపంచంలోని ముస్లిలందరూ అత్యంత పవిత్రమైనదిగా భావించే రమజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో జిల్లాలో తరావీహ్ ప్రార్థనలు మొదలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున సహరీ చేసి ఉపవాసాలు ప్రారంభించారు. మసీదుల వద్ద పలు ప్రాంతాల్లో బాణాసంచా పేల్చి పవిత్ర రంజాన్ మాసానికి ముస్లింలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఒకరినొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇక దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు, ఆత్మీయులకు ఫోన్‌లు చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు జిల్లాలోని అన్ని మసీదులు ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబయ్యాయి.


- ఇస్లాం మానవాళికి అల్లాహ్ ఇచ్చిన జీవన మార్గమని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. దీనికి మూలాధారం పవిత్ర దివ్య ఖురాన్. ఆ మహా గ్రంథం ఆవిర్భవించిన మాసమే రంజాన్. ఆధ్యాత్మికతతో పాటు దయాగుణం, సేవాభావాలు పెంపొందించడమే రంజాన్ ఉపవాస దీక్షల ముఖ్య ఉద్దేశం. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు పవిత్ర యజ్ఞంలా నెలరోజుల పాటు మనసా, వాచా, కర్మణ కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేస్తారు. ఉపవాసాల పండుగగా పిలుచుకునే రంజాన్ మాసానికి నెలవంకకు అవినాభావ సంబంధం ఉంది. అమావాస్య మరుసటి రోజు నెలవంక కనిపించగానే రంజాన్ మాసం ప్రారంభం అవుతుంది. ఆ మరుసటి రోజు వేకువ జాము నుంచి ఉపవాస దీక్షలు మొదలవుతాయి.

**కఠిన నియమాలు:** ఏడాది పొడవునా ముస్లింలు ఎటువంటి కార్యకలాపాల్లో పాలుపంచుకున్నా ఈమాసంలో మాత్రం పేద, ధనిక అన్న తేడా లేకుండా కఠిన నియమాలతో ఉపవాస దీక్షలు చేపడతారు. సూర్యోదయానికి ముందు సహర్ నుంచి సూర్యాస్తమయం ఇఫ్తార్ వరకు కనీసం మంచినీళ్లు కూడా ముట్టకుండా ఉపవాసం ఉంటారు. 30 రోజుల పాటు కొనసాగే ఈ ఉపవాసాలను మూడు విభాగాలుగా విభజించారు. మొదటి పదిరోజుల ఉపవాసాలు రహమత్‌కే రోజే (దైవకరుణ ఉపవాసాలు) అంటారు. సృష్టికర్త దయ అనుగ్రహాలు పొందేలా మొదటి పదిరోజులు ప్రార్థనలు చేస్తారు. 11వ రోజు నుంచి 20వ రోజు వరకు చేపట్టే ఉపవాసాలను మగ్‌ఫిరత్‌కే రోజే అంటారు. అంటే క్షమాపణలు కోరేవని అర్థం. 21వ రోజు నుంచి చివరి ఉపవాసం వరకు జహన్నుమ్‌సే ఫనామాంగ్నేకే రోజే అంటారు. అంటే పరలోకంలో నరకాగ్ని నుంచి కాపాడమని అల్లాను వేడుకోవడం. సాధారణ రోజుల లాగే రంజాన్ మాసంలో సైతం రోజుకు ఐదుమార్లు నమాజ్ చేస్తారు. వేకువ జామున ఫజర్, మధ్యాహ్నం జహర్, సాయంత్రం అసర్, సంధ్యాసమయంలో మగ్రిబ్, రాత్రి ఇషా నమాజులు చేస్తారు.



మదనపల్లెలోని జామియా మసీదు (ఫైల్‌ఫోటో)

### నేటి నుంచి ఉపవాసాలు



రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ఆదివారం నుంచి నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ప్రార్థనలతో గడుపుతూ ఆధ్యాత్మిక భావనలతో ఉంటారు. రంజాన్ అన్నది ఒకమాసం పేరు. ఇస్లాం ప్రకారం రంజ్ అంటే దహించేదని, అన్ అంటే నెల అని ముస్లింలు చెబుతున్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండటం దానాలు చేయడం వల్ల మనిషిలోని పాపాలను దహిస్తుందని అందువల్ల ఈనెలకు రంజాన్ అన్న పేరు వచ్చిందని మతపెద్దలు చెబుతున్నారు. ఖురాన్ గ్రంథం అవతరించిన ఈమాసంలో నెల రోజుల పాటు రాత్రి ఇషా నమాజ్ తరువాత తరావీ నమాజ్ చేస్తారు.

### ఉపవాస దీక్షలతో అల్లాహ్ కృప



రంజాన్ మాసంలో చేసే కఠోర ఉపవాస దీక్షల వల్ల అల్లాహ్ కరుణ లభిస్తుంది. పేదలకు ధానధర్మాలు చేయడం వల్ల వారి కుటుంబాలు కూడా అభివృద్ధి చెందుతాయి. అల్లాహ్ చూపిన మార్గంలో నడవడం వల్ల సమసమాజ స్థాపన, మతసామరస్యం, శాంతిసౌభ్రాతృత్వాలు వెల్లివిరుస్తాయి.

–మౌలానా అతాఉల్లాహ్, ఇమామ్, నూరాని మస్జీద్, ఈడిగపాళెం, రాజంపేట

### ఇబాదత్‌తో పుణ్యఫలం



రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనది. ఈనెల మొత్తం ఇబాదత్‌తో (దైవ ప్రార్థన) గడపాలి. దాన,ధర్మాలు చేయాలి. ఉపవాసదీక్షలు తప్పకుండా పాటించాలి. తద్వారా పుణ్యఫలం, అల్లాహ్ కృప పొందవచ్చు. రంజాన్ చివరి పది రోజుల్లో ఐదు తాఖ్‌రాత్‌లు వస్తాయి. అన్ని రాత్రులూ ఇబాదత్ బాగా చేయాలి. దువా చేయాలి.

– జలాలుద్దీన్, ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపల్లె

## క్లుప్తంగా

### మానవత్వం చాటుకున్న పోలీస్



మూర్ఛ వచ్చిన వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేస్తున్న పోలీస్ జగన్

రాయచోటి టౌన్ : చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జగన్ అనే పోలీస్ ఓ వ్యక్తి ప్రాణాన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నాడు. శనివారం శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఆయన రాయచోటికి వచ్చాడు. విధి నిర్వహణలో భాగంగా ఆలయంలో ఉన్నాడు. ఈ సమయంలో కర్ణాటకకు చెందిన ఓ భక్తుడు మూర్ఛ వచ్చి పడిపోవడంతో పోలీస్ వెంటనే స్పందించాడు. అతన్ని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించాడు. పోలీస్‌ను కర్ణాటక భక్తులతోపాటు స్థానిక భక్తులు అభినందించారు.

### అనుమానాస్పదంగా జీవాలు మృతి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం ఎర్రగుంట్ల దళితవాడలో జల్లా అంజలమ్మకు చెందిన 3 పెద్ద ఎనుములు, 3 దూడలు శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాయి. మేతకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఎనుములు ఇంటికి వచ్చాయి. వచ్చిన అర్ధగంట తరువాత కాళ్లు నీలకపోయి వెంటనే మృతి చెందాయి. ఈ జీవాలే జీవనాధారమని, ఇప్పుడు ఎలా అని అంజలమ్మ, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

### చింతకాయలు కోస్తూ.. తిరిగిరాని లోకాలకు..



మృతి చెందిన కూలి గంగులప్ప


రామసముద్రం : చింతకాయలు కోస్తూ ఓ వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని కుదురుచీమనపల్లె వద్ద శనివారం చింతకాయలు కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మాలేనత్తం పంచాయతీ కుప్పనపల్లె గ్రామానికి చెందిన గంగులప్ప(65), అతని భార్య ప్రమీలమ్మ చింతకాయలు కోసేందుకు కూలి పనికి వెళ్లారు. చింతచెట్టుపైనే కాయలు కోస్తుండగా, కింద ఉన్న 33/11 కే.వి.విద్యుత్ లైన్ తగలడంతో కిందికి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ప్రమీలమ్మ స్వల్పంగా గాయపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ పెద్ద గంగులప్ప మృతిపై కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.

# మూగ వేదన.. అరణ్య రోదన

- జిల్లాలో కరువు ఛాయలు
- గ్రాసం, నీరు లేక ఇక్కట్లు
- వలస బాటలో జీవాలు
- అష్టకష్టాలు పడుతున్న పోషకులు



దేవపట్ల సమీపంలో లారీలోకి గొర్రెలను ఎక్కిస్తున్న కాపరులు



సంబేపల్లె నుంచి వెంకటగిరికి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన గొర్రెలు, వాహనాలు

సంబేపల్లె : వర్షాభావం పశువులకు శాపంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో ఆశించినంత వర్షం కురవ లేదు. పంటలు ఎండిపోయాయి. దీంతో పశుగ్రాసం కరువైపోయింది. కడుపు నిండా మేత లేక పశువులు అల్లాడుతున్నాయి. వాటి బాధ చూడ లేక వేరే ప్రాంతాల నుంచి.. గడ్డి కొనడానికి వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అంత ధర పెట్టి గడ్డి కొనలేక, పశువులను పస్తు ఉంచలేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పశువులు ఉన్న వారి పరిస్థితే ఇలా ఉంటే.. మూగజీవాలను పోషించే వారి కష్టాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వాటిని ఎలాగోలా బతికించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పచ్చిక బయళ్లు ఉన్న కొండ ప్రాంతాల్లోని సమీప ఊర్లకు తీసుకెళ్తున్నారు. కొందరు గొర్రెలు, మేకలను తోలుసుకుని కాలినడకన వెళ్తున్నారు. మరికొందరు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇంకొందరు కబేళాలో అమ్మేస్తున్నారు. ఏదో ఓ ధరకు అమ్ముకొని గుండె నిండా ఆవేదనతో ఇళ్లకు చేరుకుంటున్నారు.

**నీటి కరువు**

వేసవి కాలం వస్తోంది. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. పొలాల వద్ద, కొండలు, గుట్టల్లో పచ్చ గడ్డి లభించడం లేదు. దీంతో మూగజీవాలకు గ్రాసం దొరకడం గగనమైంది. మండుటెండల తీవ్రతకు భూగర్భజలాలు కూడా అడుగంటిపోయాయి. గుక్కెడు నీరులేక జీవాలు అలమటిస్తున్నాయి. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా కరువు ప్రాంతం. ఏటా ఇక్కడ కరువు ఛాయలు కనిపిస్తుంటాయి. ప్రస్తుతం రాయచోటి నియోజకవర్గంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడిపోషణపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గొర్రెలు 18 లక్షలు, మేకలు 3 లక్షలు, గేదెలు 1 లక్షా 5 వేలు, ఆవులు 2 లక్షల 70 వేలు ఉన్నట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం వీటిని పచ్చిక బయళ్లు ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని వారు ఏటా శేషాచలం అటవీ సమీప ప్రాంతాలకు తీసుకెళ్తుంటారు. ఇటీవల సంబేపల్లె మండల పరిధిలోని బోయపల్లె, అన్నప్పగారిపల్లె, శెట్టిపల్లెతోపాటు పలు ప్రాంతాల నుంచి బొలేరో పికప్, లారీలతో గొర్రెలను తిరుపతి జిల్లా వెంకటగిరికి తరలించడమే ఇందుకు నిదర్శనం.

**గ్రాసం ధరకు రెక్కలు**

ఎండు పశుగ్రాసాన్ని కొనాలంటే పశుపోషకులకు తలకు మించిన భారమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో రబీలో సాగు చేసిన వేరుశనగ కట్టె ట్రాక్టర్ లోడు రూ.20 వేల నుంచి 25 వేల వరకు ధర పలుకుతోంది. వరిగడ్డి ట్రాక్టర్ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది. ఇంత రేటు పెట్టి పశుపోషకులు గ్రాసాన్ని కొనలేక పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. పాడి రైతుల పరిస్థితి కూడా ఇలాగే వుంది. బోర్ల వద్ద సాగు చేసిన గడ్డిని అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేసుకొంటున్నారు. పాలతో వచ్చిన డబ్బులు గ్రాసానికే సరిపోతే సంసారాలు ఎలా సాగాలని వారు అంటున్నారు. ప్రధానంగా మూగజీవాలను తోలుకొని ఎండకు ఆకో, అలుమో మోపుకొని వస్తే.. దప్పిక తీర్చడం పెను సవాల్‌గా మారింది. అక్కడక్కడా అడపాదడపా పొలాల పైపులైన్ల వద్ద దప్పిక తీర్చు కొంటున్నాయి. గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నీటి వనరులు వున్న చోట తొట్లను నిర్మిస్తే మూగజీవాలకు ఉపయోగంగా వుంటుంది.

**మేత కోసం అగచాట్లు**



ఎండలు రోజురోజుకు పెరుగుతున్నాయి. చుట్టుపక్కల ఎక్కడా పచ్చిమోపు కనపడలేదు. మూగజీవాలతోనే బతుకుతున్నాను. మోపుతోపాటు నీరు దొరకడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే వుంటే జీవాలను అమ్ముకోవాల్సిందే. నాకున్న 120 జీవాలను సుదూర ప్రాంతాలకు తరలించాను.

- రమణ, బోయపల్లె, సంబేపల్లె మండలం

**వెంకటగిరికి పోతున్నాం**



నాకు 300కు పైగా జీవాలు వున్నాయి. మండుటెండలో ఎటు చూసినా గ్రాసం కనుమరుగైంది. కనీసం మూగజీవాలకు తాగడానికి నీళ్లు కూడా సరిగా దొరకడం లేదు. జీవాలను తోలుకొని కాలినడక ద్వారా వెంకటగిరి దగ్గరకు వెళుతున్నా. ఇక్కడ ఉంటే జీవాలను చంపుకోవాల్సి వస్తుంది.

- ఆంజనేయులు, సంబేపల్లె మండలం

**మా దృష్టికి రాలేదు**

జిల్లా వ్యాప్తంగా ఇంత వరకు ఎక్కడా గొర్రెలు, మేకలు గ్రాసం లేక వలస వెళ్తున్నాయని మా దృష్టికి రాలేదు. గ్రామాలలో వున్న జీవాలు అక్కడే ఉన్నాయి. గత నెలలో పశు వైద్య కేంద్రాలు నిర్వహించిన సమయంలో 80 శాతం గొర్రెలకు టీకాలు వేశాం. మండలాల వారీగా పర్యటించి గొర్రెల కాపరులు, పాడిరైతులు పడుతున్న సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

- గుణశేఖర్ పిళ్లై, పశు వైద్యశాఖాధికారి, అన్నమయ్య జిల్లా

### చైన్ స్నాచింగ్ కేసు నమోదు

నిమ్మనపల్లె : మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిప్పేస్వామి తెలిపారు. ముష్టూరు పంచాయతీ వలసపల్లెకు చెందిన ఓబులమ్మ బెంగళూరులో ఉన్న కుమారుడు వాసుదేవరెడ్డి వద్ద ఉంటుంది. పింఛను తీసుకోవడానికి ఫిబ్రవరి 27న బెంగళూరు నుంచి మదనపల్లెకు చేరుకుంది. అక్కడి నుంచి మండలంలోని నిమ్మనపల్లె- మదనపల్లె రోడ్డులోని పట్వారిపల్లె ( ముష్టురు క్రాస్ ) బస్‌స్టాప్ వద్ద ఇంటికి వెళ్లేందుకు ఎదురు చూస్తోంది. అదే సమయంలో ముష్టూరు వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వేగంగా మహిళ వద్దకు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కోవడానికి ప్రయత్నించారు. ఆమె కింద పడిపోవడంతో, వెనక కూర్చున్న వ్యక్తి బలవంతంగా మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. బంగారు గొలుసు సుమారు 20 గ్రాములు ఉండగా, రూ.1.50 లక్షల విలువ చేస్తుందన్నారు. బాధిత మహిళ కుమారుడు వాసుదేవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాయచోటి టౌన్ : తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును శనివారం ఆశ్రయించారు. కోడూరునగిరిపాడు గొల్లపల్లికి చెందిన నవీన్‌కుమార్, మదనపల్లి బాటవారిపల్లికి చెందిన శిల్పా ప్రేమించుకున్నారు. ఇరువురి కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో కడపలోని ఆంజనేయస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అమ్మాయి కుటుంబ సభ్యులు తమను చంపుతామని బెదిరిస్తున్నారని వారు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాము ఇద్దరం మేజర్లమని వివరించారు. తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వారు కోరారు.

# యువత, నిరుద్యోగులకు కూటమి ద్రోహం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, బడ్జెట్‌లో విద్యా, ఉపాధిలకు నిధులు కేటాయించనందుకు ఎవరి కాలర్ పట్టుకోవాలో మంత్రి లోకేష్ చెప్పాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడు యలగచెర్ల శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే యువత, నిరుద్యోగుల కోసం ఏటా జనవరి జాబ్ క్యాలండర్ విడుదల చేసి రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి, నిరుద్యోగులకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే కాలర్ పట్టుకోవాలని లోకేష్ సభలలో చెప్పాడని, అలాగే కూటమి చెప్పే మాటలకు తాను హామీ అన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లలో ఎవరి కాలర్ పట్టుకొని ప్రశ్నించాలో వారే తెలపాలని పేర్కొన్నారు. విజన్ 2047 అనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు యువత, నిరుద్యోగులకు ఎన్నో ఆశలు చూపి తీరా అధికారం చేపట్టాక నమ్మక ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్ 3లక్షలా22వేల కోట్లు అయితే అందులో ఏ ఒక్క పథకానికి సంపూర్ణంగా నిధులు కేటాయించలేదన్నారు. నిరుద్యోగ భృతికి 57 వేల కోట్లు అవసరమని, ఒక్క రూపాయి కేటాయించలేదంటే ఆ పథకం లేనట్లేనని పేర్కొన్నారు. ఎన్నికల హామీలలో మొదటి సంతకం డీఎస్సీపై పెడతామని చెప్పి, ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీలో నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్, కొత్తపరిశ్రమల స్థాపన అంశాలే లేకుండా యువతను చంద్రబాబు మోసం చేశారని పేర్కొన్నారు. ఇలాగే యువత పట్ల నిర్లక్ష్యంగా ఉంటే పోరాటాలు, ఆందోళనలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, రెడ్డయ్య, కోటేశ్వర్‌రెడ్డి, వైఎస్ నాయుడు, ప్రశాంత్, సునీల్, మత్తయ్య, నటరాజ, షేక్‌గౌసియా, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగళ్లులో దొంగల స్వైర విహారం

- వరుసగా ఏడు దుకాణాల్లో చోరీ
- రేకుల కప్పు ఉన్న షాపులే టార్గెట్



దుకాణం పైనున్న రేకును కత్తిరించిన దృశ్యం



ఓ షాపు సీసీ పుటేజీలో దొంగల చిత్రాలు

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు కూడలి ప్రాంతంలో.. అదీ హైవే పక్కనే ఉన్న వివిధ వాణిజ్య షాపులపై శుక్రవారం రాత్రి దొంగలు స్వైర విహారం చేశారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి రెండున్నర గంటల వరకు తెగబడ్డారు. తొలుత వరుసగా ఐదు షాపుల్లో చోరీ చేశారు. ఆ తర్వాత సబ్ స్టేషన్ సమీపంలో మరో రెండు షాపుల్లోకి చొరబడి దొంగలించారు. రూ.రెండున్నర లక్ష విలువ చేసే సామగ్రి, రూ.పది వేలు నగదు చోరీ జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. దొంగల స్వైర విహారం చూస్తే ముదివేడు పోలీసులకు సవాల్ విసిరినట్లుగా ఉంది. అంగళ్లులోని ఓపీ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఈ చోరీలు జరగడం గమనార్హం. విలువైనవి పోకున్నా నిత్యం రద్దీగా ఉండే అంగళ్లులో అదీ హైవే పక్కనే ఈ చోరీలు జరగడం సంచలనాన్ని కల్గిస్తోంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అంగళ్లు సర్కిల్‌కు సమీపంలో కడప రోడ్డును ఆనుకుని శెట్టి సీతారాంరెడ్డి కాంప్లెక్స్ ఉంది. ఇక్కడ వరుసగా నాలుగు షాపుల్లో చోరీ చేశారు. షాపులకు పైనున్న రేకును కత్తిరించి లోనికి ప్రవేశించారు. అక్కడ శెట్టి కేశవరెడ్డికి చెందిన షాపులో రూ.30 వేల విలువ చేసే ట్యాబ్, ఫ్యాన్ దొంగలించారు. ఈ సంఘటన సీసీ పుటేజీలో కన్పిస్తోంది. ఈ షాపులకు అటు ఇటు ఉన్న షాపుల్లో 25 వేల విలువ చేసే కటింగ్, డ్రిల్లింగ్ మిషన్లు ఎత్తుకెళ్లారు. మరో షాపులో రూ.15 వేల విలువ చేసే వైరు ఎత్తుకెళ్లారు. ఈ షాపులకు ఎదురుగా ఉన్న ఎస్.రెడ్డిశేఖర్‌రెడ్డికి చెందిన మోటార్ రివైండింగ్ షాపులో రూ.లక్ష 30 వేలు విలువ చేసే కాపర్ వైరు, మోటార్లకు అమర్చే బుష్‌లు ఎత్తుకెళ్లారు. ఆఖరులో సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న గోపాలపురంరెడ్డి ప్రసాద్ షాపుల్లో రూ.26 వేల విలువ చేసే మల్చింగ్ పేపర్, మరో రూ.10 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అన్ని షాపులకు పైనున్న రేకును కత్తిరించి లోనికి ప్రవేశించి చోరీ చేశారు. రాత్రి 12 గంటల నుంచి రెండున్నర గంటల పాటు అంగళ్లులో దొంగలు స్వైర విహారం చేసినట్లు సీసీ పుటేజీల ఆధారంగా వెల్లడవుతోంది. హైవే పక్కన అదీ నిత్యం వాహనాల రద్దీ ప్రాంతంలో దొంగలు బరి తెగించారంటే వారికి ఎంత ధైర్యమని స్థానికులతోపాటు పోలీసులు ఆశ్చర్యపోతున్నారు. ఇంత యథేచ్ఛగా మండలంలో ఇదివరకెన్నడూ ఇలా చోరీలు జరిగిన దాఖలాలు లేవు. శనివారం ఉదయం చోరీల విషయం తెలుసుకుని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సంఘటన స్థలానికి వెళ్లి క్లూస్ టీం, వేలి ముద్రల నిపుణులు ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

**సీసీ పుటేజీల్లో స్పష్టంగా..**

అంగళ్లులో శుక్రవారం రాత్రి ఒకే రోజు వివిధ రకాలకు చెందిన ఏడు వాణిజ్య, వ్యాపార షాపుల్లో వరుస చోరీలకు పాల్పడ్డ దొంగలు దొరికినట్లేనని భావిస్తున్నారు. ఎందుకంటే వీరు చోరీ చేసిన ఓ షాపులో సీసీ కెమెరాల్లో వీరు కన్పిన్నారు. ప్రధానంగా ఇద్దరు యువకులు చోరీకి పాల్పడ్డట్లు సీసీ పుటేజీలో కన్పిస్తోంది. వీరిలో ఒకరు గుర్తు పట్టే విధంగా ముఖ కవళికలు కూడా స్పష్టంగా కన్పిస్తున్నాయి. దీంతో వీరిని పట్టుకోవడం పెద్ద కష్టం కాదని భావిస్తున్నారు. ఈ చోరీలో ఇద్దరే కాక మరి కొందరి ప్రమేయం ఉండవచ్చన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇంత పకడ్బందీగా ఒకే రాత్రి వరుస చోరీలు జరగడమంటే పగలు కన్నేయడం రాత్రి రేకులు లేపేసి చోరీ చేయడం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.



# పేద.. ఆపై పెద్ద బాధ

- కాటేసిన అగ్నిప్రమాదం
- సర్వం కోల్పోయిన కుటుంబం
- ఆదుకోవాలని వేడుకోలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు



పూరి గుడిసె ఎదుట నలుగురు ఆడ పిల్లలతో దీనంగా నిరుపేద దంపతులు

పెద్దతిప్పసముద్రం : ఈ నిరుపేద దంపతులకు సెంటు భూమి కూడా లేదు. అయితే దంపతులిద్దరూ కాయకష్టం చేస్తూ వచ్చిన డబ్బులతో నలుగురు ఆడపిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ సంతోషంగా కాలం గడిపేవారు. ఎదుగుతున్న పిల్లలను చూసి పైసా పైసా కూడబెట్టి 22 గ్రాముల బంగారంతోపాటు కొంత నగదు సమకూర్చుకుని ఇంట్లో భద్ర పరిచారు. అయితే నాలుగు రోజుల క్రితం ఈ దంపతుల ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదం వీరి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సంపతికోట దళితవాడకు చెందిన గంగంపల్లి శివన్న, రవనమ్మ దంపతులు. వీరికి నలుగురు ఆడపిల్లల సంతానం. పిల్లలందరూ 15 ఏళ్లలోపు వయసు వాళ్లే. భార్య రవనమ్మ ఇంట్లోనే టైలరింగ్ పని చేసుకునేది. భర్త తన వద్ద ఉన్న పంపులతో రైతుల పొలాల వద్దకు వెళ్లి క్రిమి సంహారక మందులను స్ప్రేయింగ్ చేసే పనికి వెళ్లేవాడు. ఈ దంపతుల కష్టార్జితం డబ్బులతో కుటుంబం సజావుగా సాగేది. ఈ నేపథ్యంలో గత నెల 26న ప్రమాదవశాత్తు ఇంట్లో జరిగిన ఓ అగ్ని ప్రమాదం ఈ కుటుంబాన్ని వీధిన పడేసింది. ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న రూ.30 వేల నగదు, 22 గ్రాముల బంగారు నెక్లెస్, నలుగురు పిల్లల వెండి కాలి గొలుసులతోపాటు బీరువాలోని దుస్తులు, రిఫ్రిజిరేటర్, మందు కొట్టే స్ప్రేయింగ్ పంపులు, మిక్సీ, వంట పాత్రలు, ఆధార్, రేషన్ కార్డులు, పిల్లల జనన ధ్రువ పత్రాలన్నీ కాలి బూడిద అయ్యాయి. ఈ ఘటనలో బతుకు జీవుడా అంటూ ఈ కుటుంబం కట్టుబట్టలతో బతికి బయట పడ్డారు. ప్రధానంగా పంపులు, టైలరింగ్ మిషన్ మాత్రమే వీరికి జీవనోపాధి. అవి కూడా కాలిపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఈ కుటుంబం లోలోపలే కుమిలిపోతూ దుర్భరంగా కాలం వెళ్ళదీస్తోంది. ఇంటి పైకప్పు రేకులు సైతం కాలిపోవడంతో నిలువ నీడ లేక సమీపంలోనే కూలడానికి సిద్ధంగా ఉన్న ఓ పూరి గుడిసెలో ఈ కుటుంబం తల దాచుకుంటోంది. ఎవరైనా వచ్చి ఆపన్నహస్తం అందించి ఆదుకుంటారనే ఆశతో కళ్లకు ఒత్తులు వేసుకుని నిరీక్షిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన రోజు రెవెన్యూ అధికారులు 50 కిలోల బియ్యం మాత్రం అందజేసి చేతులు దులుపుకున్నారే గానీ ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదు. దీంతో వీధిన పడిన కుటుంబంలోని నలుగురు చిన్నారుల దుస్థితి చూసి చలించిపోయిన పలువురు గ్రామస్థులు ఆహారం వండుకునేందుకు వంట పాత్రలు, కూరగాయలు, కొంత మంది వ్యక్తులు వారికి తోచిన నగదు సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అగ్ని ప్రమాద నష్ట పరిహారం మంజూరయ్యేలా, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమయ్యే ధ్రువ పత్రాలను త్వరితగతిన వచ్చేలా అధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వం తమ కుటుంబ జీవనోపాధి కోసం ఆర్థిక సహాయం అందజేయాలని నిరుపేద దంపతులు కోరుతున్నారు.

# హత్య కేసులో వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

పులివెందుల రూరల్ : ఓ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మురళీ నాయక్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లింగాల మండలం దిగువపల్లి గ్రామానికి చెందిన పప్పూరి గంగిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 24న అరటి తోట వద్ద హత్యకు గురయ్యాడు. ఈ సంఘటనపై మృతుడి పెద్ద కుమారుడు యోగానందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. లింగాల మండలం దిగువపల్లి గ్రామ పొలాల్లోని సర్వే నంబర్ 132-పీ1-ఏలో కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ బొర్రా ప్రతాప్ రెడ్డి, అతని అన్న కేతిరెడ్డి నాగేశ్వరరెడ్డికి ఒక్కొక్కరికి 4.50 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి ఉంది. అప్పులు ఉండి సుమారు పదేళ్ల క్రితం నాగేశ్వరరెడ్డి 4.50 ఎకరాల వ్యవసాయ భూమిని దిగువపల్లి గ్రామస్తుడు పప్పూర్ గంగిరెడ్డి చిన్న కుమారుడు దామోదర్‌రెడ్డికి అమ్మినాడు. తర్వాత సుమారు ఒక సంవత్సరం నుంచి కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి పొలంలో ఉన్న అరటి పంట కోత ఉన్నప్పుడు పొలంలోకి లారీ వచ్చే దానికి దారి లేదని పప్పూరి గంగిరెడ్డి గొడవపడేవాడు. అందుకు ప్రతాప్‌రెడ్డి ఈ పొలం అన్నదమ్ముల భాగం కనుక దారి ఎందుకు ఉండదని గంగిరెడ్డితో గొడవపడేవాడు. ఫిబ్రవరి నెల 24న ప్రతాప్‌రెడ్డి మోటార్ సైకిల్‌పై తన అరటి తోటలో గల గెలలకు పోట్లు పెట్టుకొనే దానికి ఇంటి దగ్గరి నుంచి మచ్చు కొడవలి తీసుకొని వెళ్లాడు. తోట వద్ద గెలలకు పోట్లు పెట్టుకుంటూ ఉండగా, తోట పక్కన ఉన్న గంగిరెడ్డి ఇంత కుమునుపు ఉన్న పాత కక్షలు మనసులో పెట్టుకొని రేపు నీ తోటలోకి లారీ వస్తే రానీయను, నీకు దారి లేదు అని చెప్పి గొడవ పెట్టుకున్నాడు. అన్నదమ్ముల తోటలో దారి లేకుండా ఎక్కడికి పోతుందని గంగిరెడ్డితో అన్నాడు. అందుకు గంగిరెడ్డి రేపు లారీ ఎట్లా వస్తుందో చూస్తా అన్నాడు. అందుకు ప్రతాప్‌రెడ్డి ఇప్పుడే పోతాను ఏమి చేస్తావు అని, ఇరువురు ఒకరినొకరు తిట్టుకుంటూ తోపులాటకు దిగారు. గంగిరెడ్డిని ప్రతాప్‌రెడ్డి గట్టిగా తోయగా కిందపడి లేచి తన చేతిలో ఉన్న కొడవలిని మీదికి విసిరాడు. ఆ కొడవలి కుడి కాలు మోకాలుకు తగిలింది. ప్రతాప్ రెడ్డి తన చేతిలో ఉన్న మచ్చు కొడవలితో గంగిరెడ్డి మెడ పైన నరకబోగా.. తన చేయి అడ్డం పెట్టాడు. మళ్లీ మెడ పైన నరకబోగా మరొక చేయి అడ్డం పెట్టాడు. తర్వాత మెడపైన, తల వెనక వైపున నరకగా గంగిరెడ్డి కింద పడిపోయాడు. తర్వాత ప్రతాప్‌రెడ్డి తన మోటార్ సైకిల్‌పై మచ్చుకొడవలితో పారిపోయాడు. అతన్ని పులివెందుల రూరల్ సీఐ కేవీ రమణ శనివారం అరెస్ట్ చేశారు. సమావేశంలో పోలీసు హెడ్‌కానిస్టేబుల్ నూర్ బాషా ఉన్నారు.

# హామీల అమలుకు కేటాయింపులెక్కడ?

- అప్పులపైన కూటమి అబద్ధాలు
- వ్యవసాయంపై నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : హామీల అమలుకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. రాయచోటిలో ఆయన శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు అంటూ కూటమి ప్రభుత్వం చేసిన దుష్ప్రచారం బడ్జెట్ లెక్కల సాక్షిగా బయట పడిందన్నారు. బడ్జెట్ అంచనా వ్యయం రూ.3,22,359 కోట్లు, రెవెన్యూ రాబడి రూ.2,17,976 కోట్లు, అప్పు రూ.1,04,382 కోట్లుగా చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి సందర్భంలోనూ గత ప్రభుత్వం అంటూ వైఎస్సార్ సీపీపై దూషణాలకు పాల్పడుతోందన్నారు. సంపద దృష్టి అంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటురని, పది నెలల్లో మైనస్ 0.01 శాతం వృద్ధిలో ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి పాలన చేతకాదన్న మీరు పది నెలల్లో సాధించిన అభివృద్ధి శూన్యం అన్నారు.

**పథకాల కేటాయింపుల్లో చిత్తశుద్ధి లేదు**

సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు చూస్తే ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. గత బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవం ప్రకటించినా దానిని అమలు చేయలేదన్నారు. యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేలు భృతి అన్నారన్నారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థికి రూ.15 వేలు, ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం, అర్హులైన మహిళలకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా ఏ హామీకి సరైన కేటాయింపులు లేవన్నారు. 2025-26లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు కేటాయిస్తున్నామని చెప్పారే తప్ప.. ఎంత కేటాయిస్తున్నారో ప్రకటించలేదన్నారు. తల్లికి వందనం పైన కూడా స్పష్టత లేదన్నారు.

**వ్యవసాయం..**

తాజా బడ్జెట్‌లో వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ధాన్యంకు గత ఏడాది రూ.1740 క్వింటా రేటు ఉంటే, ఈ ఏడాది రూ.1470 నుంచి రూ.1500గా ఉందన్నారు. వ్యవసాయదారులు దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఎక్కడా రైతులను ఆదుకోవడం లేదన్నారు.

**అన్ని వర్గాలకు అండగా..**

జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2023 జూలైలో ఉద్యోగులకు చివరి డీఏ ఇచ్చామన్నారు. 2024 జనవరి, జూలైలకు సంబంధించిన డీఏలను కూటమి ప్రభుత్వం బకాయి పెట్టిందన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు పట్టించుకునే వారు లేర్నారు. డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల సొమ్మును జమ చేశామన్నారు. ఇలాగే కూటమి ప్రభుత్వం కూడా ఇస్తుందని ప్రజలు ఆశపడ్డారన్నారు. కానీ మొదటికే మోసం వచ్చిందని ప్రజలు ఇప్పుడు చర్చించుకుంటున్నారని ఆయన విమర్శించారు.